జిల్లాలో 99,685 టన్నుల ధాన్యం కొనుగోలు

డిఎస్‌ఒ సరోజ

ఆకివీడు : జిల్లాలో ఇప్పటివరకు దాల్వా కోతలు ధాన్యం 99,685 టన్నులు కొనుగోలు చేసినట్లు జిల్లా పౌరసరాఫరాల శాఖ అధికారి ఎన్.సరోజ తెలిపారు. బుధవారం ఆమె మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలు పరిశీలించారు. కుప్పనపూడి సహకార శాఖ గెడ్డంగిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. అనంతరం అజ్జమూరు రైస్ మిల్లును ఆమె పరిశీలించి ధాన్యం కొనుగోళ్ల వివరాలు తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దాల్వా వరి పంట కోతలు పూర్తికాని రైతులు మరో మూడు రోజుల పాటు వరి కోతలు కోయ్యొద్దని ఆమె సూచించారు. వాతావరణం రీత్యా ఈ సూచన చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే కోతలు పూర్తయిన రైతులు తమ ధాన్యాన్ని వెంటనే మిల్లులకు, కొనుగోలు కేంద్రాలకు తోలుకోవాలని చెప్పారు. తహశీల్దార్ నండూరి వెంకటేశ్వరరావు, వ్యవసాయ శాఖ అధికారి ఎ.ప్రియాంక పాల్గొన్నారు.

ఎంపీ గారూ.. ప్రజల గోడు పట్టదా..!

నేవీ ఆయుధ డిపోపై పదేపదే ప్రకటనలపై జనాగ్రహం

గ్రామసభల్లో మూడుసార్లు వ్యతిరేకించిన ఐదు గ్రామాల ప్రజలు

ప్రజల అభిప్రాయాలకు విలువ లేదా అని ఎంపీని ప్రశ్నిస్తున్న జనం

ఈ డిపో ఏర్పాటు వెనుక మీ ఆంతర్యం ఏంటంటూ విమర్శలు

ఏజెన్సీలో గిరిజనులను ఇబ్బంది పెట్టడమే ప్రజాప్రతినిధుల లక్ష్యమా?

ఆయుధ డిపోపై ముందుకెళ్తే ప్రతిఘటన తప్పదంటూ హెచ్చరికలు

ఆయుధ డిపోను వ్యతిరేకిస్తూ గ్రామసభలో చేతులెత్తిన ప్రజలు (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ తీరుపై ఏజెన్సీలోని ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా నేవీ ఆయుధ డిపోపై పదేపదే ప్రకటనలు చేయడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. మూడు సార్లు గ్రామసభల్లో ఆయుధ డిపోకు వ్యతిరేకంగా తీర్మానాలు చేసినప్పటికీ డిపో ఏర్పాటు చేస్తామంటూ ఎంపీ చేస్తున్న ప్రకటన వెనుక అసలు ఉద్దేశం ఏమిటో చెప్పాలని ఏజెన్సీ ప్రజలు నిలదీస్తున్నారు. తాము ఓట్లు వేసి గెలిపించుకున్న ఎంపీ తమకు వ్యతిరేకంగా పని చేయడం ఏంటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంపీ పుట్టా మహేష్ వచ్చి తమతో మాట్లాడితే ఆయుధ డిపో ఏర్పాటు చేస్తే ఎటువంటి ఇబ్బందులు వస్తాయి.. తాము ఏవిధంగా నష్టపోతాం.. ఇప్పటికే ఏజెన్సీలో గిరిజనులు ఏవిధంగా నష్టపోయారు.. అనేది అన్ని వివరాలు చెబుతామని అక్కడి జనం చెబుతున్నారు. జీలుగుమిల్లి మండలంలోని వంకావారిగూడెం, దాట్లవారిగూడెం, మడకం వారిగూడెం, రమణక్కపేట, కొత్తసీమలవారిగూడెం మొత్తం ఐదు గ్రామాల పరిధిలో నేవీ ఆయుధ డిపో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం చూస్తోంది. 2023లో వైసిపి ప్రభుత్వం డిపో ఏర్పాటుపై ముందుకు సాగేందుకు ప్రయత్నించగా ఐదు గ్రామాల ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారు. ఏజెన్సీ చట్టాల ప్రకారం ఏజెన్సీ ప్రాంతంలో ఏ పని చేపట్టాలన్నా గ్రామసభ తీర్మానం అత్యంత ముఖ్యం. వైసిపి హయాంలో రెండు సార్లు గ్రామసభలు చేపట్టగా అక్కడి ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తూ తీర్మానం చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక అక్టోబర్ 28న జరిగిన గ్రామసభలో మరోసారి ముక్తకంఠంతో ఆయుధ డిపోను వ్యతిరేకిస్తూ తీర్మానం చేశారు. ఇప్పటి వరకూ మూడుసార్లు వ్యతిరేకంగా తీర్మానాలు చేసినప్పటికీ ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ మాత్రం జీలుగుమిల్లి మండలంలో ఆయుధ డిపో ఏర్పాటు చేస్తామని పదేపదే ప్రకటనలు చేస్తుండటం చర్చనీయాంశమైంది. దీన్ని బట్టి ఎంపీ పుట్టా మహేష్ ప్రజాభిప్రాయానికి విలువ లేదన్నట్లు మాట్లాడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆయుధ డిపో ఏర్పాటుకు దాదాపు 1,166 ఎకరాలు సేకరించనున్నట్లు అందుకు సంబంధించిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఐదు గ్రామాలు పూర్తిగా కనుమరుగు కానున్నాయి. అంతేకాకుండా ఆయుధ డిపో ఏర్పాటైతే ఆ ప్రభావం జీలుగుమిల్లి మండలం మొత్తంగా పడుతోంది. నేవీ అధికారుల ఆంక్షలతో అక్కడి ప్రజల జీవనం తీవ్ర ఇబ్బందికరంగా మారే పరిస్థితి ఏర్పడనుంది. అంతేకాకుండా ఆయుధ డిపో ఏర్పాటైతే కాలుష్యంతో అనారోగ్య సమస్యలతోపాటు అనేక ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని చెబుతున్నారు.

ఏజెన్సీలోనే ఎందుకు.. వేరే చోట ఎందుకు పెట్టరు..?

ఏలూరు జిల్లాలో పోలవరం, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, కుక్కునూరు, వేలేరుపాడు మొత్తం ఐదు మండలాల్లో ఏజెన్సీ ప్రాంతం విస్తరించి ఉంది. ఇప్పటికే పోలవరం ప్రాజెక్టు పేరుతో కుక్కునూరు, వేలేరుపాడు మండలాలను ముంపు ప్రాంతాలుగా ప్రకటించారు. పోలవరం మండలంలో 25 గ్రామాలను ఇప్పటికే ఖాళీ చేయించి తరలించారు. పోలవరం ముంపు గ్రామాల ప్రజలకు జీలుగుమిల్లి మండలంలోనే అత్యధికంగా 20 కాలనీలు వరకూ నిర్మిస్తున్న పరిస్థితి ఉంది. జల్లేరు ప్రాజెక్టు పేరుతో జీలుగుమిల్లి మండలంలోని పాత, కొత్త జిల్లెళ్లగూడెం గ్రామాలు, పాత, కొత్త బొత్తప్పగూడెం గ్రామాలు, తాటిరామన్నగూడెం, లంకాలపల్లి వంటి గ్రామాలు ముంపుబారిన పడుతున్నాయి. బుట్టాయగూడెం మండలంలోనూ ముంపు గ్రామాలు ఉన్నాయి. ఇప్పుడు జీలుగుమిల్లి మండలంలో ఆయుధ డిపో ఏర్పాటు చేస్తే అక్కడి ప్రజలు ఎక్కడకు పోవాలి. గిరిజనులను తరమి వేయడమే ప్రభుత్వం, ప్రజాప్రతినిధుల లక్ష్యమా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మైదాన ప్రాంతాల్లో అనేకచోట్ల భూములు అందుబాటులో ఉన్నప్పటికీ ఏజెన్సీలో నేవీ ఆయుధ డిపో ఏర్పాటు చేయాలని ఎందుకు ముందుకు సాగుతున్నారనే అనుమానాలు నెలకొన్నాయి. అభివృద్ధి పేరుతో గిరిజనులకు మనుగడ లేకుండా చేయాలనే కుట్ర దాగి ఉన్నట్లు ఏజెన్సీ ప్రజల్లో చర్చ సాగుతోంది. ఏజెన్సీలో భూముల ధరలు తక్కువగా ఉంటాయనే కారణంతోనే ఇక్కడ డిపో ఏర్పాటు చేసేందుకు పూనుకుంటున్నారనే అభిప్రాయమూ వ్యక్తమవుతోంది. పోలవరం నిర్వాసితులకు పరిహారం, భూమికి భూమి, ఇళ్ల నిర్మాణం విషయంలో దశాబ్ద కాలంగా ఏజెన్సీ ప్రజలు ఎన్ని ఇబ్బందులు పడుతున్నారో అందరికీ కళ్ల ముందే కనిపిస్తోంది. ఇప్పుడు ఆయుధ డిపో పేరుతో గిరిజనులకు అన్యాయం చేసేందుకు ప్రజాప్రతినిధులు వ్యవహరిస్తున్న తీరు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. గెలిచే వరకూ ఒకలా.. గెలిచిన తర్వాత మరోలా ప్రజా ప్రతినిధులు వ్యవహరిస్తున్నారంటూ అక్కడి ప్రజలు ఆవేదన చెందుతున్నారు. తమ అభిప్రాయానికి భిన్నంగా ఆయుధ డిపోపై ముందుకు సాగితే ప్రతిఘటన పెద్దఎత్తున తప్పదని ఏజెన్సీ ప్రాంత ప్రజలు హెచ్చరిస్తున్నారు

ఎట్టి పరిస్థితుల్లో ఆయుధ డిపో పెట్టనీయం..

తెల్లం సంకురుడు, రమణక్కపేట గ్రామం

మా పంచాయతీ పరిధిలో నేవీ ఆయుధ డిపో ఏర్పాటుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నాలు చేస్తున్నాయి. ఎట్టి పరిస్థితుల్లో దాన్ని ఇక్కడ పెట్టనివ్వం. మా ప్రమేయం లేకుండా పెట్టాలని చూస్తే మా ప్రాణాలైనా ఇస్తాం. ఆయుధ డిపోను మాత్రం మా ఏజెన్సీ ప్రాంతంలో పెట్టనీయబోము.

ఎంపీ వ్యాఖ్యలు బాధాకరం..

కణితి ధనలక్ష్మి, దాట్లవారిగూడెం

నేవీ ఆయుధ సామగ్రి డిపో ఏర్పాటుకు వ్యతిరేకంగా మూడుసార్లు గ్రామ సభల్లో తీర్మానం చేశాం. ఎంపీ మాత్రం త్వరలో మా గ్రామాల్లో ఆయుధ డిపో ఏర్పాటు చేస్తామని చెప్పడం బాధాకరం. ఆయుధ డిపో వస్తే గిరిజనుల బతుకులు బుగ్గిపాలవుతాయి. ఆయుధ డిపో నిర్మించుకోవాలనుకుంటే మైదాన ప్రాంతంలో ఏర్పాటు చేసుకోవాలి.

ఏజెన్సీని అభివృద్ధి చేయండి..

తెల్లం అబ్బులు, వంకావారిగూడెం

నేవీ ఆయుధ డిపో ఏజెన్సీ ప్రాంతంలో పెడతామని ఎంపీ అనడం బాధాకరం. ఏజెన్సీలోని గిరిజనుల పట్ల ఎంపీకి మక్కువ ఉంటే మా ఏజెన్సీ ప్రాంతాలను ప్రజలకు ఉపయోగపడేలా అభివృద్ధి చేయాలని కోరుతున్నాం.

వైద్యులు ఉత్తమ సేవలందించాలి

జిల్లా కలెక్టర్ నాగరాణి

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

ప్రభుత్వ వైద్యులు ఉత్తమ వైద్య సేవలందించి ప్రజల మన్ననలు పొందడంతో పాటు రోగుల్లో నమ్మకాన్ని పెంపొందించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. నిరుపేదలు ఆర్థికంగా, సంతోషంగా జీవించాలనే లక్ష్యంతో ప్రభుత్వ హాస్పిటల్స్ వైద్యులు, స్పెషలిస్టులు స్నేహపూరితమైన సేవలందించాలని ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, జిల్లాలో ప్రభుత్వ హాస్పిటల్స్ సూపరింటెండెంట్లతో నిర్వహించిన సమీక్షా సమావేశానికి కలెక్టరు అధ్యక్షత వహించారు. జిల్లాలో ప్రభుత్వ హాస్పటల్స్ పనితీరు, భవన నిర్మాణాలు, సదరన్ సర్టిఫికెట్ల జారీ, ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్ తదితర 12 అంశాలపై మండలాల వారీగా సమీక్షించి టార్గెట్స్ లోటు ఉన్న మండలాలపై కలెక్టరు అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అనారోగ్య కారణాలతో అప్పులు బారిన పడి కుటుంబాలు ఆర్థికంగా కుంగిపోకుండా సమాజంలో నిరుపేదలు, మధ్యతరగతి కుటుంబాలు ఆర్థికంగా, సంతోషంగా జీవించాలని రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యానికి ఎంతో ప్రాధాన్యతిస్తోందన్నారు. ప్రభుత్వ నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా ప్రభుత్వ హాస్పిటళ్లలో స్నేహ పూర్వకమైన వైద్య సేవలందించి ప్రజల మన్ననలు పొందాలన్నారు. డెలివరీ కేసులన్నీ ప్రభుత్వాసుపత్రికి వచ్చే విధంగా ప్రజలకు నమ్మకాన్ని కలిగించాలన్నారు. సుఖ ప్రసవాలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. పాలకొల్లు వంద పడకల హాస్పిటల్ రహదారుల పనులు పూర్తిచేసి ఈనెల చివరినాటికి సిద్ధం చేయాలన్నారు. తాడేపల్లిగూడెం, భీమవరం నిర్మాణాలు వేగవంతం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను కలెక్టరు ఆదేశించారు. సమావేశంలో డిఎంహెచ్ఒ డి.మహేశ్వరరావు, డిసిహెచ్ఎస్ అధికారి పి.సూర్యనారాయణ, ఎపి మెడికల్ కార్పొరేషన్ డిఇ ఎం.శ్రీనివాస రెడ్డి, ప్రభుత్వ హాస్పిటల్స్ సుపరింటెండెంట్లు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై విస్తృత ప్రచారం చేయాలి

జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై విస్తృత ప్రచారం కల్పించడంతోపాటు, నిరోధానికి గట్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. బాల్ వివాహ ముక్త్ భారత్ జాతీయ ప్రచార కార్యక్రమాన్ని న్యూఢిల్లీ విజ్ఞాన్ భవన్ నుంచి కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖా మంత్రి అన్నపూర్ణాదేవి బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ మేరకు స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖ అధికారులతో కలిసి పాల్గొని కార్యక్రమాన్ని వర్చువల్‌గా తిలకించారు. అనంతరం కలెక్టర్ నాగరాణి బాల్య వివాహాలకు వ్యతిరేకంగా సామూహిక ప్రతిజ్ఞ చేయించారు. బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే అమలు చేసే చట్టాలపై రూపొందించిన సమాచార వాల్‌పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 'బాల్ వివాహ ముక్త్ భారత్' ప్రచారం ద్వారా దేశాన్ని బాల్య వివాహ రహితంగా మార్చడంపై దృష్టి సారించినట్లు తెలిపారు. బాల్య వివాహాలు సాంఘిక దురాచారమని తెలిపారు. బాల్య వివాహాల కారణంగా బాలిక విద్య, రక్షణ, ఆరోగ్యం, అభివృద్ధిపై తీవ్ర ప్రభావం చూపుతాయన్నారు. 18 ఏళ్ల బాలికలను లేదా 21 ఏళ్ల బాలురను వివాహం చేసుకోవడం చట్ట విరుద్ధమని, దీనిని ప్రోత్సహిస్తే జైలుకు వెళ్లాల్సి ఉంటుందని హెచ్చరించారు. బాల్య వివాహాలపై పోలీసులకు సమాచారం అందించడానికి డయల్ 100, 112 నంబర్లను వినియోగించాలన్నారు. అలాగే చైల్డ్ లైన్ హెల్ప్ నంబర్ 1098కు కాల్ చేయాలని, సమాచారం తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా స్త్రీ, శిశుసంక్షేమ శాఖ అధికారి బి.సుజాతరాణి, జిల్లా బాలల సంరక్షణ అధికారి ఆర్.రాజేష్, డిఎంహెచ్ఒ డి.మహేశ్వరరావు, విద్యాశాఖ సహాయ సంచాలకులు కె.సంధ్య, ఐసిడిఎస్ నోడల్ అధికారి విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఆర్థిక నేరాలపై మౌనం సరికాదు

సిపిఎం మండల మహాసభలో జిల్లా కార్యదర్శి బలరాం

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

ప్రజాశక్తి - ఆకివీడు

అదానీ ఆర్థిక నేరాలపై టిడిపి, జనసేన, వైసిపి మౌనం వహించడం సరికాదని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం అన్నారు. సిపిఎం ఆకివీడు మండల 9వ మహాసభ సిద్ధాపురం రైల్వే గేట్ వద్ద నేరెళ్ల ఫంక్షన్ హాల్లో బుధవారం జరిగింది. తొలుత మహాసభ ప్రారంభంలో పార్టీ పతాకాన్ని సిపిఎం సీనియర్ నాయకులు బొక్కా సత్యనారాయణ ఆవిష్కరించారు. ఇటీవల మరణించిన సిపిఎం అగ్రనేతలు సీతారాం ఏచూరి, బుద్ధదేవ్ భట్టాచార్య, ఆర్.సత్యనారాయణ రాజు, వలవల శ్రీరామ్మూర్తి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కార్యక్రమానికి పెంకి అప్పారావు, ఎస్.కిసింజర్, దొకల లక్ష్మి, సందక ఉదయ కుమారి అధ్యక్ష వర్గంగా వ్యవహరించినా ముఖ్యవక్తగా పాల్గొన్న బి.బలరాం మాట్లాడారు. దేశ సంపద మొత్తం అదానీ, అంబానీ చేతుల్లో పెట్టి దేశ ఆర్థిక వ్యవస్థను అంపశయ్యపై ఉంచారన్నారు. మోడీ విధానాలను చంద్రబాబు, పవన్, జగన్ ప్రశ్నించకపోవడం దారుణమన్నారు. రాష్ట్రంలోని ఈ మూడు పెద్ద పార్టీలు కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ఉన్నట్లే ప్రజలు భావిస్తున్నారన్నారు. వారి వైఖరిని బహిరంగపర్చాలన్నారు. ప్రభుత్వ బ్యాంకులను లూటీ చేసి, ప్రజా సంపదను కార్పొరేట్లు అనుభవిస్తున్నారన్నారు. పార్లమెంట్లో సమాధానం చెప్పలేనిమోడీ ప్రభుత్వం సభను వాయిదాలు వేయడం హేయమైన చర్య అని విమర్శించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో సూపర్ సిక్స్ పేరుతో ప్రభుత్వ పథకాలను ఆర్భాటంగా ప్రకటించి ఓట్లు దండుకున్న కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక హామీల అమలుకు చిత్తశుద్ధి లేకుండా వ్యవహరిస్తోందన్నారు. ప్రభుత్వ పథకాలను కత్తిరిస్తే ప్రజలతో పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఆకివీడులో గత నాలుగు నెలలుగా రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా పేదవాళ్ల ఇళ్లను తొలగించే పనిలో ఇక్కడున్న ప్రజాప్రతినిధులు నిమగ్నమయ్యారని విమర్శించారు. పేదలపై ప్రతాపాన్ని ఆపకపోతే పేదలంతా ఐక్యతతో పోరాడతారని తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడుతూ రాష్ట్రంలో స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలపై విద్యుత్ భారాలను మోపే ప్రణాళికను ప్రభుత్వం రూపొందించిందని, దాన్నితిప్పి కొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఇక్కడ డంపింగ్ యార్డు సమస్య తీవ్రంగా ఉన్న స్థానిక మున్సిపాల్టీ పాలకవర్గం దృష్టి పెట్టడం లేదని విమర్శించారు. తక్షణం పెద్దల ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూములను స్వాధీన పర్చుకుని ఆకివీడుకు డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయాలన్నారు. తాళ్లకోడు కాలనీని ఆకివీడు మున్సిపాల్టీలో కలుపుతూ గెజిట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.వాసుదేవరావు, డి.కళ్యాణి తదితరులు మాట్లాడారు. పట్టణ కార్యదర్శి తవిటినాయుడు గత మూడేళ్లలో జరిగిన ఉద్యమాలు, పోరాటాలను మహాసభ దృష్టికి తీసుకొచ్చారు. మండలంలోని ప్రజా సమస్యలపై మహాసభ పలు తీర్మానాలను చేసింది. ఈ కార్యక్రమంలో పట్టణ కమిటీ సభ్యులు బివి.వర్మ, డి.రవితేజ, బి.రాంబాబు, జి.రాంబాబు, నాయకులు ఎస్.సూరిబాబు, బి.బలరాం, జి.ధనుష్, వి.సత్యవతి, కె.పెద్దిల్లు, పాలెపు రమణమ్మ, గండికోట శ్రీను పాల్గొన్నారు.

ఉద్దరాజు రామం ఆశయ సాధనకు కృషి

వర్ధంతి కార్యక్రమంలో సిపిఎం నాయకులు

తాడేపల్లిగూడెం : చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

స్వాతంత్ర సమర యోధుడు, జీవితాంతం ప్రజల పక్షాన నిలచి పోరాడిన యోధుడు, ఉద్దరాజు రామం ఈనాటి యువతరం ఆదర్శంగా తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కర్రి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. తాడేపల్లిగూడెం సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఉద్దరాజు రామం 30వ వర్ధంతి సభ స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో గొన్నాబత్తుల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ముందుగా ఉద్దరాజు రామం చిత్రపటానికి సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కర్రి నాగేశ్వరరావు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఉద్యమ నిర్మాతలలో ఒకరైన ఉద్దరాజు రామం ఉన్నత కుటుంబంలో జన్మించి పేద, పీడిత ప్రజల కోసం నిరంతరం పనిచేసారని, కష్టజీవులకు రాజ్యాధికారం రావాలని నిరంతరం పార్టీలో పనిచేసారన్నారు. జీవితాంతం ప్రజల పక్షాన నిలిచి, కమ్యూనిస్టు పార్టీ నాయకునిగా, మార్క్సిస్టు పార్టీ రాష్ట్ర నేతగా పీడిత ప్రజల విముక్తి కోసం, సమ సమాజ నిర్మాణం కోసం జరిగిన అనేక పోరాటాల్లో పాల్గొన్నారని అన్నారు. సిపిఎం పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ మాట్లాడుతూ స్వాతంత్ర సమర యోధుడు ఉద్దరాజు రామంని ఈనాటి యువతరం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆయన ఆశయాలను కొనసాగించాలని సిపిఎం కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ వర్ధంతి సభలో కర్రి సాయిరెడ్డి, దత్తు రాము, పోతు శ్రీను, శిద్దిరెడ్డి శేషుబాబు, దేవల శివ గణేష్, నాగిరెడ్డి సాయి, మిద్దేజాను, యడవల్లి వెంకట దుర్గారావు పాల్గొన్నారు.

తణుకు : స్వాతంత్ర సమరయోధుడు, మాజీ ఎంపి, జిల్లా కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత ఉద్దరాజు రామం పోరాట స్ఫూర్తితో ప్రజా, రైతుల సమస్యలపై సిపిఎం పోరాటం సాగిస్తుందని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పివి ప్రతాప్ అన్నారు. బుధవారం స్థానిక అమరవీరుల భవనం వద్ద ఉద్దరాజు రామం 30వ వర్ధంతిని సిపిఎం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రైతుల సమస్యలు పరిష్కరించాలని, స్వామినాధన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ తమ ప్రాణాలు సైతం లెక్క చేయకుండా ఉద్దరాజు రామం దేశ స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొన్నారన్నారు. కమ్యూనిస్టులకు పదవులు వస్తే అది ప్రజల కోసం ఎలా ఉపయోగించాలో ఆచరణలో చేసి చూపించారని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు గార రంగారావు, గుబ్బల గోపి, మూర్తి, ఉష పాల్గొన్నారు.

భీమవరం : భీమవరంలోని సుందరయ్య భవనంలో ఉద్దరాజు రామం 30వ వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం టౌన్ నాయకులు ఎం.వైకుంఠ రావు, సిపిఎం సీనియర్ నేత త్రిమూర్తులు రామం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వైకుంఠరావు మాట్లాడుతూ భీమవరంలో కమ్యూనిస్టు నిర్మాణం కోసం కృషిచేసిన వ్యక్తి, రైతు ఉద్యమంలో రైతుల సమస్యలపై పోరాడిన వ్యక్తి, దళితుల పట్ల, అణగారిని వర్గాల పట్ల ప్రేమానురాగాలు చూపారని, కష్టజీవుల బతుకులు బాగుపడాలని అనేక పోరాటాలు చేసిన వ్యక్తి అని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు చల్లబోయిన వెంకటేశ్వరరావు, ఎం.ఆంజనేయులు, క్రాంతి బాబు, లత కుమారి, సత్యనారాయణ, డి.త్రిమూర్తులు పాల్గొన్నారు.

ఆచంట : ఉద్దరాజు రామం ఆశయ సాధనకు కృషి చేయవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని సిపిఎం మండల కార్యదర్శి పి.మోహన్‌రావు అన్నారు. ప్రముఖ స్వతంత్ర సమరయోధులు, మాజీ పార్లమెంట్ సభ్యులు, రైతు నేత, తొలితరం కమ్యూనిస్టు నాయకుడు ఉద్ధరాజు రామం 30వ వర్ధంతి వేడుకలు ఆచంట సిపిఎం కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పశ్చిమగోదావరి జిల్లా యువజన సంఘం అధ్యక్షునిగా ఎన్నికై, యువకులతో రాజకీయ చైతన్యానికి నూతన ఉత్సవం నింపిన నాయకుడు ఉద్ధరాజు రామం అని కొనియాడారు. ఈయన వ్యవసాయ కూలీలకు రాత్రిపూట పాఠాలు చెబుతూ యువజన సంఘాలు స్థాపించేవారన్నారు. పేటలో, గ్రామాల్లో రాత్రి సమయంలో రచ్చబండ వద్దకు చేరి యువకులతో అభ్యుదయ సాహిత్యం చదివి వినిపించేవారని అన్నారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని అలుపెరగని పోరాటం చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు సిర్రా నరసింహమూర్తి, తలుపురి బుల్లబ్బాయి, కుసుమ జయరాజు, ఎస్‌విఎన్.శర్మ, సీనియర్ నాయకులు తోటపల్లి సత్యనారాయణ, కొండేటి సత్యనారాయణ, చదలవాడ చంటిబాబు, శ్రీపాద ప్రజ్వల, శ్రీపాద ప్రభవ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు.

పాలకొల్లు : జిల్లా కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, ఆదర్శనీయుడు ఉద్ధరాజు రామం అని మాజీ ఎంఎల్ఎ దిగుపాటి రాజగోపాల్ కొనియాడారు. బుధవారం ఆయన వర్ధంతి సందర్భంగా పార్టీ కార్యాలయం వద్ద ఆయన చిత్రపటానికి పి.సోమరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజగోపాల్ మాట్లాడుతూ పార్లమెంటు సభ్యులుగా, రైతాంగ నాయకులుగా ఎనలేని సేవ అందించారన్నారు. కాళీపట్నం భూముల విషయంలో రాజీలేని పోరాటం నిర్వహించారన్నారు. నిరాడంబరంగా జీవిస్తూ, సౌమ్యుడుగా అన్ని రాజకీయ పార్టీల నాయకులచే గౌరవింపబడ్డారన్నారు. ఆయన ఆశయాలు కొనసాగించినప్పుడే ఆయనకు ఇచ్చే ఘనమైన నివాళులని రాజగోపాల్ అన్నారు. కన్వీనర్ జవ్వాది శ్రీనివాసరావు, యాకల రాము, అరటకట్ల నారాయణమ్మ మాట్లాడారు. వై.అజయ్ కుమార్, డి.రోజామణి, జె.లక్ష్మి, సోమరాజులు పాల్గొన్నారు.

అదానీ గ్రూపుతో ఒప్పందాలను రద్దు చేయాలి

సిపిఎం ఆధ్వర్యాన నిరసన

నిరసన వ్యక్తం చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

అదానీకి కేటాయించిన భూములను, ప్రజల సంపదను వెనక్కి తీసుకోవాలని సిపిఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. వెంప గ్రామంలోని బస్టాండ్ సెంటర్లో బుధవారం సిపిఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అదానీ గ్రూపుతో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలను రద్దు చేయాలన్నారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడుతూ ఇంతజరుగుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాట్లాడకపోవడం సిగ్గుచేటు అన్నారు. విద్యుత్ పేరుతో ప్రజలపై వేస్తున్న అదనపు ఛార్జీలను వెనక్కి తీసుకోవాలని, అదానీతో ఒప్పందం చేసిన స్మార్ట్ మీటర్ల నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, ప్రజలపై భారాలు ఆపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వర్ధనపు కన్నమ్మ దాసు, పెదపాటి చిన్ని, వేగి మోహన్‌రావు, సానబోయిన సత్యనారాయణ, ఉల్లంపర్తి చిన్ని పోలుకొండ కుటుంబరావు పాల్గొన్నారు.

ఆదేశిక సూత్రాలకు విరుద్ధంగా పాలన

రాజ్యాంగ ప్రచార వేదిక సమన్వయకర్త డివివిఎస్.వర్మ

సమావేశంలో మాట్లాడుతున్న డివివిఎస్ వర్మ

ప్రజాశక్తి - తణుకు

రాజ్యాంగం మీద ప్రమాణం చేసిన పాలకులు ఆదేశిక సూత్రాలకు విరుద్ధంగా పాలన సాగించడం రాజ్యాంగాన్ని ఉల్లంఘించడమేనని రాజ్యాంగ ప్రచార వేదిక సమన్వయకర్త డివివిఎస్ వర్మ విమర్శించారు. బుధవారం స్థానిక సురాజ్య భవనంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవ వజ్రోత్సవ సభ డివివిఎస్ వర్మ అధ్యక్షతన జరిగింది. తొలుత అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలకు అనుగుణంగా సంపద వికేంద్రీకరణతో సంక్షేమాన్ని విస్తృతపరిచే శ్రేయోరాజ్య సాధనకు తగిన ప్రజా ఉద్యమానికి సన్నాహాలు చేయాలని తణుకు ప్రజా సంఘాల సభ పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా డివివిఎస్ వర్మ మాట్లాడుతూ ప్రజల ప్రయోజనాలకు ఉపయోగపడవలసిన భౌతిక సంపద ప్రయివేటు వ్యక్తుల పరంచేయడం, ప్రభుత్వ విధానాలతో సంపద కొద్దిమంది దగ్గర పోగుపడకూడదన్న ఆదేశానికి భిన్నంగా సంపద పోగుపడటం, మద్యం నిషేధానికి దారులు వేయాలని సూచిస్తే ప్రభుత్వాలు మద్యాన్ని ఆదాయమార్గం చేసుకోవడం రాజ్యాంగ ఆదేశాలకు విరుద్ధమని ఆయన స్పష్టం చేశారు. రాజ్యాంగ పీఠిక ప్రకటించిన సామాజిక, ఆర్థిక న్యాయం అందరికీ కల్పించడానికి పోగుపడ్డ సంపదను వికేంద్రీకరించే నినాదంతో ప్రజాసంఘాలు ఉద్యమించాలన్నారు. రాబోయే జనవరి 26 రిపబ్లిక్ దినోత్సవాన్ని ఈ నినాదంతో నిర్వహించాలని పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా కార్యదర్శి పివి ప్రతాప్ మాట్లాడుతూ పాలక పక్షాలు రెచ్చగొడుతున్న మత విద్వేషాన్ని ప్రతిఘటిస్తూ ఐక్యంగా ప్రజా ఉద్యమం సాగించాలన్నారు. ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు కోనాల భీమారావు మాట్లాడుతూ శ్రమజీవులంతా సంపద పునఃపంపిణీ నినాదంతో ఐక్యంగా ఉద్యమించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మెన్ ఆకుల వెంకటేశ్వరరావు, తణుకు స్టడీ సర్కిల్ డాక్టర్ రమేష్‌చంద్రబాబు, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కామన మునిస్వామి, సిపిఐ నాయకులు బొద్దాని నాగరాజు పాల్గొన్నారు.

ఓం అం అ: రెస్టారెంట్ ప్రారంభం



రెస్టారెంట్ ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

మర్యాదలకు ఆతిథ్యమంటే భీమవరమేనని, అటువంటి భీమవరంలో ఎన్నో రుచులతో ఓం అం అ: నూతన రెస్టారెంట్ ప్రారంభించడం అభినందనీయమని ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. బుధవారం భీమవరం పద్మాలయ థియేటర్ రోడ్డులోని కోదండ రామాలయం వద్ద నూతన ఓం అం అ: రెస్టారెంట్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ ప్రజలకు రుచికరమైన భోజనాలను అందించాలని అన్నారు. నిర్వాహకులు జి.వాసు వర్మ, యు.మోహిత్ వర్మ మాట్లాడుతూ తమ రెస్టారెంట్‌లో రుచికరమైన అన్ని రకాల వెజ్ అండ్ నాన్ వేజ్ బిర్యానీలు లభిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకులు కోళ్ల నాగేశ్వరరావు, పొత్తూరి బాపిరాజు, టౌన్ హాల్ అధ్యక్షులు కోళ్ల రామచంద్ర రావు పాల్గొన్నారు.

సిపిఎం మండల కన్వీనర్‌గా సత్యనారాయణ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

సిపిఎం తాడేపల్లిగూడెం రూరల్ కన్వీనర్‌గా పాలువూరి సత్యనారాయణ రెండవసారి ఎన్నికయ్యారు. బుధవారం మాధవరంలో జరిగిన మండల మహాసభలో ఆరుగురు సభ్యులతో మండల కమిటీ ఏర్పడింది. పాలువూరి సత్యనారాయణ కన్వీనర్‌గా, మండల కమిటీ సభ్యులుగా కండెల్లి సోమరాజు, పాలువూరి సత్యవతి, పురిటిగడ్డ జయమ్మ, సిద్ద బత్తుల నాగేశ్వరరావు, పూరెల్ల సుబ్బారావు ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో మండలంలో ఎర్ర కాలవ ముంపు నుంచి శాశ్వత పరిష్కారం చూపాలని, మండలంలో ఉన్న అన్ని రోడ్లను నిర్మించాలని, నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని, అర్హులైన వారందరికీ పెన్షన్లు ఇవ్వాలని, ఉపాధి హామీ పనులు 200 రోజులు కల్పించి, రూ.600 వేతనం ఇవ్వాలని, అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు మంజూరు చేయాలని సిపిఎం మండల కమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.

మెడికల్ కాలేజీకి శరీరదానం

నరసాపురం : తన తండ్రి మరణించినా ఈ లోకంలో జీవించి ఉండాలన్న ఉద్దేశంతో కుమారుడు తన తండ్రి కళ్లను ఐ బ్యాంకుకు, మృతదేహాన్ని మెడికల్ కాలేజీకి దానం చేశారు. మండలంలోని లక్ష్మణేశ్వరం గ్రామానికి చెందిన కంథాళ సూర్యనారాయణమూర్తి(90) ఇటీవల మృతి చెందాడు. అయితే తన తండ్రిపై ప్రేమ, చివరి కోరికగా తన మరణానంతరం తన శరీరం వృథాగా ఉండకూడదన్న ఉద్దేశంతో కళ్లు, శరీరాన్ని దానం చేశారు. తన అవయవాలు దానం చేస్తే కొంతమందికైనా ఉపయోగపడుతుందన్న ఉద్దేశంతో శరీరాన్ని, నేత్రాలను దానం చేసినట్లు సూర్యనారాయణమూర్తి కుమారుడు ప్రసాద్ చెప్పారు. తన తండ్రి అవయవాలను దానం చేయడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

108 అంబులెన్స్‌లో ప్రసవం

పెనుమంట్ర : పురిటి నొప్పులతో బాధపడుతున్న ఒక నిండు గర్భిణిని 108 వాహనంలో ఆసుపత్రికి తీసుకుని వెళ్తుండగా బ్రాహ్మణచెర్వులో ప్రసవించిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. మండలంలోని పొలమూరు గ్రామానికి చెందిన ఉప్పల అరుణ దేవి(24) మూడవ కాన్పులో ప్రసవ నొప్పులతో బాధపడుచుండగా కుటుంబ సభ్యులు 108లో అత్యవసర వాహనానికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పెనుమంట్ర 108 వాహన సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని ప్రసవ వేదన పడుతున్న మహిళను 108లో పెనుమంట్ర పిహెచ్‌సికి తరలిస్తుండగా, బ్రాహ్మణ చెరువు సాయినాథ్ వాటర్ ప్లాంట్ సమీపంలో వచ్చేసరికి పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో అంబులెన్స్‌లోనే సిబ్బంది పురుడు పోశారు. ఆమె పండంటి ఆడ శిశువుకు జన్మ ఇచ్చారు. అందుకు సహకరించిన 108 వాహనం ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ సిహెచ్.బాలకృష్ణ, పైలెట్ జి.వెంకట్రావుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం తల్లి, శిశువును పిహెచ్‌సికి తరలించారు.

ఉల్లిపాయల అమ్మకానికి ప్రత్యేక కౌంటర్లు

భీమవరం : నాణ్యమైన ఉల్లిపాయలు కిలో రూ.50, పామాయిల్ రూ.110 చొప్పున ప్రతి నియోజకవర్గంలో ప్రత్యేక కౌంటర్ల ద్వారా వినియోగదారులకు సరసమైన ధరలకు అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేటులో సివిల్ సప్లైస్, మార్కెటింగ్, హోల్ సేల్ ఉల్లిపాయల వర్తకులతో సమావేశమై వినియోగదారులకు అందుబాటు ధరలలో ఉల్లిపాయలు, పామాయిల్ అందించేందుకు జెసి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉల్లిపాయలు, పామాయిల్ బల్క్‌గా కొనుగోలు చేసి ఏడు నియోజకవర్గాలలో ప్రతి నియోజకవర్గానికి ఒక ప్రత్యేక కౌంటర్‌ను మార్కెటింగు శాఖ ద్వారా ఏర్పాటుచేసి అమ్మకాలు చేపట్టడం జరుగుతుందన్నారు. లాభనష్టాలు లేకుండా హోల్‌సేల్ ధరకే అమ్మకాలు చేపట్టేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని, హోల్ సెల్ వర్తకులు కూడా సహకరించాలని కోరారు. డియస్ఓ ఎన్.సరోజ, జిల్లా మార్కెటింగ్ శాఖాధికారి కె.సునీల్ కుమార్ పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఆవశ్యకతపై అవగాహన

ఉండి : సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వల్ల దొంగతనాలు, నేరాలు తగ్గుతాయని ఉండి ఎస్ఐ మహమ్మద్ నశీరుల్లా అన్నారు. బుధవారం ఆయన కలిసిపూడి, చెరుకువాడ గ్రామాల్లో పర్యటించి సీసీ కెమెరాల ఆవశ్యకతను పంచాయతీ సర్పంచులకు, ఎంపిటిసిలకు, పంచాయతీ కార్యదర్శులకు, గ్రామ పెద్దలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో నేర ప్రవృత్తి రోజురోజుకీ పెరిగిపోతుందని, ప్రతిఒక్కరూ కష్టపడకుండా సులభంగా డబ్బు సంపాదించడానికి అలవాటు పడిపోయారన్నారు. సీసీ కెమెరాలు గ్రామ మెయిన్ సెంటర్లలో, దుకాణాల వద్ద వీలైన వారు ఇళ్ల వద్ద ఏర్పాటు చేయడం వల్ల నేరాలను అరికట్టడమే కాకుండా నేరస్తులను త్వరగా గుర్తించడానికి దోహదపడతాయన్నారు. దీనిపై గ్రామ సర్పంచులు గ్రామ పెద్దలతో మాట్లాడి సీసీ కెమెరాల ఏర్పాటు దిశగా ప్రయత్నించాలన్నారు. చెరుకువాడ గ్రామ సర్పంచి కొండవీటి సాంబశివరావు(శివయ్య), కలిసిపూడి సర్పంచి జానకి శ్రీనివాస్ పాల్గొన్నారు.

'భవిష్యత్ అంతా కృత్రిమ మేధస్సుదే'

తాడేపల్లిగూడెం : కృత్రిమ మేధస్సు సాంకేతిక పరిజ్ఞానాన్ని పరిశ్రమలు వివిధ రంగాల్లో విరివిగా వినియోగిస్తున్నారని, భవిష్యత్తు అంతా కృత్రిమ మేధస్సుదేనని తిరుపతి ఐఐటి కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ చీమలకొండ శ్రీధర్ సూచించారు. ఎపి నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్, ఆచార్యులు డాక్టర్ ఎన్‌వి.రమణారావు ఆధ్వర్యంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్ రెడ్డి పర్యవేక్షణలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం సహకారంతో కెరీర్ ఇన్ కంప్యూటింగ్ ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ అనే అంశంపై బుధవారం విద్యార్థులకు అవగాహనా సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ కె.హిమబిందు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ తరగతి గదే దేశ భవిష్యత్తును నిర్ణయిస్తుందని తెలిపారు. ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాల్లో చెత్తేస్తే యజమానికి నోటీసులివ్వాలి

మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి

భీమవరం టౌన్ : స్థానిక భీమవరం పట్టణ పరిధిలోని 30వ వార్డులో మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి తనిఖీ చేశారు. బుధవారం ఈ తనిఖీలలో భాగంగా వార్డు సచివాలయ సిబ్బందితో ఆయన మాట్లాడుతూ వార్డులలో సేకరించే చెత్తను విడివిడిగా వాహనాలకు అందించాలని సూచనలు జారీ చేశారు. వర్షాల దృష్ట్యా లోతట్టు ప్రాంతాలలో ఎప్పటికప్పుడు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, సంబంధిత ఇంజనీరింగ్, పారిశుధ్య సిబ్బందికి తగు సూచనలు జారీ చేశారు. వార్డులలోని ఖాళీ స్థలముల యాజమానులకు నోటీసులు జారీ చేసి ఎప్పటికప్పుడు చెత్తను తొలగించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత పారిశుధ్య సిబ్బందికి తగు సూచనలు జారీ చేశారు.

భూ సర్వే నిర్వహించాలి : ఆర్‌డిఒ

మొగల్తూరు : నాగదేవత కాలనీలో సర్వే నిర్వహించి స్థలానికి హద్దులు నిర్ణయించాలని ఆర్‌డిఒ దాసిరాజు సర్వే సిబ్బందికి ఆదేశించారు. మండల కేంద్రం మొగల్తూరులోని నాగదేవత ఆలయ సమీపంలో ఉన్న కాలనీలో ఇల్లు నిర్మించుకున్న వారికి, సమీపంలోని రైతుకు మధ్య సరిహద్దు తగాదా నేలకు ఉంది. దీనిపై భూ యజమాని స్పందనలో వినతి పత్రం అందించారు. సమస్య పరిష్కార నిమిత్తం ఆయన బుధవారం సాయంత్రం సంఘటనా ప్రాంతాన్ని సందర్శించారు. భూమికి సర్వే నిర్వహించి హద్దులు నిర్మించాలని ఆదేశించారు. ఆయన వెంట తహశీల్దార్ కె.రాజకిషోర్, ఎంపిడిఒ సిహెచ్.త్రిశూలపాణి ఉన్నారు.

తులసీరావుకు ప్రశంసా పత్రం అందజేత

నరసాపురం : నరసాపురం లేసు అల్లికలకు అంతర్జాతీయ స్థాయిలో ఉన్న గుర్తింపు, ప్రాధాన్యత దృష్ట్యా హస్తకళల రంగంలో మహిళలకు మరింతగా ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు. నరసాపురం మండలం రుస్తుంబాదలోని లేసు పార్కుకు హస్తకళల రంగంలో కేంద్ర ప్రభుత్వం భౌగోళిక గుర్తింపు ఇచ్చిన నేపథ్యంలో అమరావతిలో జరిగిన కార్యక్రమంలో రుస్తుంబాద అంతర్జాతీయ లేసు ట్రేడ్ సెంటర్ సమన్వయకర్త కల్వకొలను తులసీరావుకు సిఎం ప్రశంసా పత్రం అందజేసి అభినందించారు. ఈ విషయాన్ని తులసీరావు బుధవారం వెల్లడించారు. నరసాపురం లేసు అల్లికలకు జాతీయ స్థాయిలో భౌగోళిక గుర్తింపు లభించిన స్ఫూర్తితో అంతర్జాతీయ స్థాయిలో లేసు, హస్తకళల రంగంలో వినియోగదారుల అభిష్టానికి అనుగుణంగా వినూత్నమైన లేసు ఉత్పత్తులను రూపొందించి, వాటికి అంతర్జాతీయ స్థాయిలో మార్కెట్ కల్పించేందుకు, ప్రభుత్వపరంగా ప్రోత్సహిస్తామని సిఎం అభిప్రాయాన్ని వ్యక్తం చేశారని తులసీరావు తెలిపారు. నరసాపురం లేసు అల్లికలకు కేంద్ర ప్రభుత్వం భౌగోళిక గుర్తింపును ఇవ్వడం ద్వారా తనకు లభించిన ప్రశంసా పత్రం ఈ రంగంలో దశాబ్దాల తరబడి లేసు అల్లికల రంగంలో రాణిస్తున్న మహిళలు, ఉత్పత్తిదారులు, ఎగుమతి దారులకు చెల్లుతుందని తులసీరావు ఈ సందర్భంగా అన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

తూకంలో మోసం అరికట్టేదెవరు..!

ప్రజాశక్తి - వీరవాసరం

రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేసే క్రమంలో కొంత మంది దళారులు తూకంలో మోసానికి పాల్పడుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. అయితే ఈ మోసం నిగ్గు తేల్చడానికి ఎవరికి చెప్పుకోవాలో తెలియక కొంత మంది రైతులు ఒక ప్రజాప్రతినిధి వద్ద మొరపెట్టుకున్నారు. దీంతో ప్రభుత్వం అనుసరిస్తున్న ధాన్యం కొనుగోలు విధానం పారదర్శకంగా ఉన్నట్టు, అభివృద్ధి చెందిన తూకం విధానంతో రైతులు అవగాహన లేక మోసపోతున్నట్టు గ్రహించారు. గతంలో తూకం రాళ్లతో ధాన్యం తూచేవారు, ఇప్పుడు ఎలక్ట్రానిక్ తూకం అందుబాటులోకి రావడంతో వాటిని ఉపయోగించి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. అయితే ఎలక్ట్రానిక్ కాటాలో నిక్షిప్తమైన సాంకేతికతపై రైతులకు అవగాహన లేకపోవడంతో వారి అవగాహనాలేమిని కొంత మంది దళారులు అనుకూలంగా మార్చుకుని, తప్పుడు తూకంతో రైతులను దగా చేస్తున్నట్టు తెలుస్తుంది. ఎలక్ట్రానిక్ కాటాని కొన్ని సాంకేతిక మార్పులు చేసి ఎక్కువ బరువును తక్కువ బరువుగా చూపించే వెసులుబాటు ఉంటుంది. ఉదాహరణకు నలభై కేజీల అసలు బరువు ధాన్యాన్ని ఒక కేజీ తక్కువ చూపించవచ్చు. ఇటువంటి మోసాన్ని సాంకేతికంగా అవగాహన ఉన్నవారు మాత్రమే కనిపెట్టగలరు.

ప్రస్తుతం ఒక సంచి బరువుతో కలిపి ఒక బ్యాగ్‌కు నలభై ఒకటి కేజీల ధాన్యాన్ని పడుతున్నారు.

దళారుల అక్రమాలకు రైతుల గగ్గోలు..



అనుమానం వచ్చిన ఒక రైతు తూకం వేసిన బస్తాను వేరొక కాటాలో వేసి తూకం వేయగా నలభై రెండు కేజీలు వచ్చినట్టు గుర్తించాడు. దీంతో సదురు రైతు తూకంలో మోసం జరుగుతున్నట్టు గ్రహించాడు. ఇదే మోసాన్ని మరికొంత మంది రైతులు కూడా గుర్తించినట్టు స మాచారం. అయితే ఈ తూకంలో జరు గుతున్న మోసం ఎవరు అరికడతారో తెలియని స్థితిలో రైతులు ఉన్నారు. ధాన్యం తూకం వేసేటప్పుడు వ్యవసాయ శాఖ వారు ఏర్పాటు చేసిన టెక్నీషియన్ ఉన్నప్పటికీ రైతులు మోసపోవడం గమనార్హం. ఈ తూకం మోసంలో వారి ప్రమేయం కూడా ఉంటుందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ మోసం మిల్లుల వద్ద బహిర్గతమయ్యే అవకాశం ఉన్నా వే బిల్లు, రశీదులు రైతుల చేతికి చేరకపోవడంతో తూకంలో వస్తున్న హెచ్చు తగ్గులు తెలిసే అవకాశం ఉండటం లేదు. ధాన్యం కళ్లాల్లో దళారి రైతు నిర్ధారించుకున్న తూకానికి మాత్రమే డబ్బులు చెల్లిస్తున్నారు. పైకి రైతులు నేరుగా ప్రభుత్వానికే ధాన్యం అమ్ముకుంటున్నట్టుగా కనిపించినా కొంతమంది రైతుల వాస్తవ వ్యవహారం వేరేగా ఉంటుంది. దళారి నుంచి ముందస్తు పెట్టుబడులు తీసుకున్న కొంతమంది రైతులు దళారి ఆధ్వర్యంలోనే ప్రభుత్వానికి ధాన్యం అమ్మవలసిన పరిస్థితులు నెలకొన్నాయి. ఒక వేల రైతు బ్యాంకు ఖాతాలో అమ్మిన ధాన్యం కంటే ఎక్కువ సొమ్ము చేరినా సదరు దళారి ముందుగా వేసుకున్న ఒక ఎత్తుగడతో సదరు రైతు ధాన్యంతో పాటే వేరొక రైతు ధాన్యం కూడా నీ పేరున మిల్లుకు తోలడం జరిగిందని రైతును నమ్మిస్తాడు. కావును ఆ ఎక్కువగా పడిన సొమ్ము తిరిగి ఇవ్వాలని మెలిక పెట్టడంతో అమాయక రైతులు ఆ డబ్బులను దళారికి తిరిగి ఇచ్చేయడం జరుగుతుంది. ప్రస్తుతం ఈ సార్వా సీజన్‌లో ఒక ఎకరానికి సాగుచేసిన రకాన్ని బట్టి 30 నుంచి 35 బ్యాగుల వరకు దిగుబడి వస్తుంది. ఈవిధంగా ఒక బ్యాగుకు ఒక కేజీ చొప్పున మోసం జరిగితే, 35 కేజీల వరకు అంతకు మించి మోసం జరిగితే అదే స్థాయిలో రైతు కూడా నష్టపోవడం జరుగుతుంది. రైతులకు జరుగుతున్న తూకం మోసం పట్ల తూనికల-కొలతల అధికారులు దృష్టి పెట్టి ధాన్యం కొనుగోలుకు ఉపయోగిస్తున్న ఎలక్ట్రానిక్ కాటాలను పరిశీలించి, వాటిపై రైతులకు అవగాహన కల్పించాలని సదరు ప్రజాప్రతినిధి కోరుతున్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

అల్పపీడనం ప్రభావంతో రాబోయే నాలుగు రోజులు అధిక వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించిన కారణంగా, రైతులు కళ్లాల్లోని తమ ధాన్యాన్ని వెంటనే జాగ్రత్తపరచుకోవాలని, కోతలు ఎవరూ కోయకూడదని రైతులకు తహశీల్దార్ వై.దుర్గా కిషోర్ సూచించారు. మండలంలోని దగ్గులూరులో రైతుల కళ్లాలను తహశీల్దార్ పరిశీలించారు. రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తహశీల్దార్‌తో పాటు డిటి నరేష్ కుమార్, వ్యవసాయ అధికారిని అడ్డాల పార్వతి రైతులకు తగు సూచనలు చేశారు.

గణపవరం : రాబోయే మూడు రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వరి కోతలు కోసే రైతులు మూడు రోజులు ఆగి, వర్షాలు తగ్గిన తరువాత కోసుకోవాలని రైతులకు వ్యవసాయ సహాయ సంచాలకులు పి.మురళీకృష్ణ సూచించారు. బుధవారం మండలంలోని కొమ్మర, ముగ్గళ్ల, పిప్పర, ఎ.గోపవరం గ్రామంలో పర్యటించి రైతులతో మాట్లాడారు. రోడ్ల పక్కన కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని ధాన్యం కొనుగోలు సిబ్బంది వీలైనంత తొందరగా రైసుమిల్లుకి పంపించాలని ఆదేశించారు. ధాన్యాన్ని మిల్లులకు పంపే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

మొగల్తూరు : మండలంలోని గ్రామాలలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వెంకటేశ్వరరావు పర్యటించారు. బుధవారం మొగల్తూరులోని జాతీయ రహదారిపై ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. రానున్న మూడు రోజులు వర్షాభావం పరిస్థితులు ఉన్నందున రైతుల తాము ఒబ్బిడి చేసిన ధాన్యాన్ని త్వరితగతిన రైతు సేవా కేంద్రాల ద్వారా విక్రయించాలని సూచించారు. వరిచేలు కోయనటువంటి రైతులు మూడు రోజులపాటు కోతలు వాయిదా వేయాలని సూచించారు. రైతు సేవా కేంద్రాల్లో గోనెసంచులు అందుబాటులో ఉన్నాయన్నారు. దళారులు నమ్మి ధాన్యాన్ని విక్రయించవద్దని ఆయన అన్నదాతలకు సూచించారు. ఆయన వెంట వ్యవసాయ శాఖ ఎఒ ఎస్.అబ్దుల్ రహీం, సిబ్బంది ఉన్నారు.

ఆచంట : తుఫాన్ ప్రభావం కారణంగా రైతులందరూ అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ జి.కనకరాజు అన్నారు. బుధవారం మండలంలోని ఆచంట, శేషమ్మ చెరువు, పెనుమంచిలి, కొడమంచిలి గ్రామాలలో మండల వ్యవసాయ అధికారి, తహశీల్దార్‌లు పర్యటించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి బి.నాగరాజు మాట్లాడుతూ తుఫాను ప్రభావంపై రైతులందరూ అప్రమత్తంగా ఉండాలని, వరికోతలు పూర్తి చేసుకుని కల్లాలపై ఉన్న ధాన్యాన్ని రైతులు త్వరితగతిన మిల్లులకు చేరవేయాలని సూచించారు.

తాడేపల్లిగూడెం : రాబోయే నాలుగు రోజులు తుపాను కారణంగా వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతులందరూ అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి ఆర్ఎస్.ప్రసాద్ సూచించారు. బుధవారం కృష్ణయ్య పాలెం, జగన్నాథపురం, పడాల గ్రామాల్లో ఆయన పర్యటించి రైతులను అప్రమత్తం చేశారు. మండలంలో ఇంకా 2500 ఎకరాల్లో వరి కోతలు కోయాల్సి ఉందని, కోతలు ఈ నాలుగు రోజులు నిలిపివేయాలని సూచించారు. 4100 ఎకరాల్లో ధాన్యం ఆరబెట్టుకుని ఉన్న రైతులందరూ రైతు సేవా కేంద్రాల ద్వారా మిల్లులకు తరలించాలని, కావాల్సిన గోనె సంచులు, రవాణా వాహనాలు సిద్ధంగా ఉంచామని తెలిపారు. ఆరబెట్టిన, కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని భద్రపర్చుకోవడానికి బరకాలు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు.

యలమంచిలి : చించినాడ హైస్కూల్ ఆవరణలో విద్యార్థుల ప్రతిజ్ఞ

మహిళల చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి - యలమంచిలి

మండలంలోని చించినాడ హై స్కూల్‌లో అంగన్వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో బాల్య వివాహరహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడుతూ బాల్య వివాహాలు ఒక సాంఘీక దురాచారమని, బాలికల విద్య, రక్షణ ఆరోగ్యం, అభివృద్ధికి ఒక ఆటంకంగా మారుతుందని, దీన్ని సమాజంలోని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. గ్రామ సర్పంచి దంగేటి రాజమణి, బి.రజిని, ఎన్.సుజాత, కె.భారతి, జి.సత్య జ్యోతి, వెల్ఫేర్ అసిస్టెంట్ టి.త్రిమూర్తులు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గణపవరం : ఐసిడిఎస్ పిప్పర సెక్టార్ ఆధ్వర్యాన బుధవారం స్థానిక మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పిప్పర సెక్టార్ సూపర్‌వైజర్ సిహెచ్.దుర్గాభవాని మాట్లాడుతూ బాల్య వివాహ రహిత రాష్ట్రం కావలన్నదే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. బాల్యవివాహాలు సాంఘీక దురాచారమన్నారు. బాల్యంలో వివాహాలు చేయటం వల్ల విద్యకు, ఆరోగ్యానికి ఆటకం కలుగుతుందని చెప్పారు. గృహహింస, చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త బి.విజయలక్ష్మీ, తల్లులు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

తణుకు రూరల్ : దువ్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాలు చేయడం వలన వచ్చే అనార్థలపై బుధవారం అవగహనా కార్యక్రమం నిర్వహించారు. ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆఫీసర్ ప్రమోదిని కుమారి మాట్లాడుతూ ఆడపిల్లలకు 18 సంవత్సరాలు, మగ పిల్లలకు 21 సంవత్సరాలు నిండకుండా పెళ్లిళ్లు చేయకూడదని అవగాహన కల్పించారు. న్యాయవాదులు కౌరు వెంకటేశ్వర్లు, అంగన్వాడీ సూపర్వైజర్ పివి.లక్ష్మి, హెచ్‌ఎం బండి ఆంజనేయులు పాల్గొన్నారు.

మొగల్తూరు : పిల్లలకు చిన్న వయసులోనే వివాహాలు చేస్తే భవిష్యత్తులో ఇబ్బందులు ఎదుర్కొంటారని న్యాయవాది సంతోష్ కుమారి అన్నారు. మొగల్తూరు పంచాయతీ దయాల్దాస్ పేటలో న్యాయ అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహం చేయడం నేరం, బాల్య వివాహం చేస్తున్న తల్లిదండ్రులకు, ప్రోత్సహించే వారికి చట్టపరమైన శిక్షకు గురవుతారని అన్నారు. ప్యానల్ లాయర్ కె.శిరీష, పారా లీగల్ వాలంటీర్ డి.వరలక్ష్మి పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యత

నరసాపురం : ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యం ఇస్తామని నరసాపురం మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య తెలిపారు. బుధవారం పట్టణంలోని పలు వార్డులలో కమిషనర్ అంజయ్య పర్యటించారు. ఈ సందర్భంగా వార్డులో నెలకొన్న మంచినీటి సమస్య, డ్రెయినేజీ, పలు సమస్యలను ప్రజల నుంచి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సానిటరి ఇన్‌స్పెక్టర్ వేంద్ర ప్రసాద్, సానిటరీ మేస్త్రిలు కిషోర్, నరేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ఓరియంటేషన్ ప్రోగ్రామ్

తాడేపల్లిగూడెం : ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో బుధవారం నూతనంగా చేరిన పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థుల ఓరియంటేషన్ ప్రోగ్రామ్, ఫ్రెషర్స్ పార్టీని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ విజయనిర్మల హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు ఎక్కువ సమయాన్ని పుస్తకాలతో గడపాలని, వ్యక్తిగత ఎదుగుదల, తోటి విద్యార్థుల మధ్య సమతుల్యతను కాపాడుకోవాలని తెలిపారు. వివిధ పోస్ట్ గ్రాడ్యుయేట్ విభాగాలకు చెందిన కోర్స్ కోఆర్డినేటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం

నరసాపురం : నరసాపురం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈనెల 29వ తేదీ శుక్రవారం ఉదయం 11.30 నిమిషాలకు కౌన్సిల్ హాలులో నిర్వహిస్తున్నట్లు నరసాపురం మున్సిపల్ ఛైర్‌పర్సన్ బర్రె శ్రీవెంకటరమణ తెలిపారు. ఈమేరకు ఆమె బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సమావేశానికి సకాలంలో కౌన్సిల్ సభ్యులు హాజరు కావాలని ఆమె కోరారు.

వేరుశనగ విత్తనాలు అందజేత

రైతులు కోతలు వాయిదా వేయాలి : వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు జెడ్.వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - నరసాపురం

విత్తనాలు పంపిణీ చేస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో కోత దశకు వచ్చిన వరి పంటకు నష్టం వాటిల్లే పరిస్థితి ఉన్నందున రైతులు కోతలను కొన్ని రోజులు వాయిదా వేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు జెడ్.వెంకటేశ్వరరావు సూచించారు. నరసాపురం వ్యవసాయశాఖ కార్యాలయంలో తూర్పుతాళ్లు గ్రామానికి చెందిన 50 మంది రైతులకు బుధవారం వ్యవసాయశాఖ అధికారులతో కలిసి వేరుశనగ పంటను ప్రోత్సహించేందుకు ఉచితంగా వేరుశనగ విత్తనాలను వ్యవసాయ శాఖ ద్వారా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలుకు జిల్లా అంతటా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. రైతులు దళారుల చేతిలో మోసపోకుండా రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం విక్రయించిన 48 గంటల్లోగా రైతు బ్యాంకు ఖాతాకు సొమ్ము జమ అవుతుందన్నారు. సొమ్ము జమాలో జాప్యం జరిగితే తమకు ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ అనిల్ కుమారి, ఎఒలు శామ్యూల్ జాన్సన్, అబ్దుల్ రహీమ్, వ్యవసాయ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి భరోసా హర్షదాయకం

రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం

ప్రజాశక్తి - పెనుమంట్ర

రాష్ట్రంలోని వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగుల రోజువారీ పని గంటల విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన భరోసా హర్షదాయకమని రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షులు భూపతిరాజు రవీంద్ర రాజు అన్నారు. బుధవారం ఆయన ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. అంబేద్కర్ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఉద్యోగులు ప్రతిరోజు అన్ని శాఖలకు సంబంధించిన వారు సాయంత్రం 6 గంటల తర్వాత ఆఫీసుల్లో పనిచేసే అవసరం లేదని ఉద్యోగులకు భరోసా ఇవ్వడం అందరికీ ఆనందం కలిగించిందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల అధికారులకు, ఉన్నతాధికారుల నుంచి స్పష్టమైన ఆదేశాలు ఇప్పించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

ఆదేశాలు అమలు కావడం లేదు : ముఖ్యమంత్రి ఇచ్చిన లేదా, చెప్పిన ఆదేశాలు కింది స్థాయిలో అధికారులు అమలు చేయకుండా రాత్రులు, పగలు పనులు చేయాలని తీవ్ర ఒత్తిడి చేయడంతో ఉద్యోగులు తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు. ఈ మధ్యకాలంలో గ్రామ రెవెన్యూ అధికారులు పని ఒత్తిడితో బాగా ఇబ్బందులు పడుతున్నారని, సచివాలయ సిబ్బందిని కూడా టార్గెట్ల పేరుతో అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. దీనికి ఈ మధ్యకాలంలో ఇబ్రహీంపట్నంలో, తూర్పుగోదావరి జిల్లా రాజనగరం మండలంలో జరిగిన ఘటనలే ఉదాహరణ అన్నారు. కింది స్థాయిలో ఇవి అమలు చేయాలని కోరారు.

అంతర్జాతీయ కరాటే పోటీలకు ఎస్‌జెజిఎం విద్యార్థులు

భీమవరం టౌన్ : అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీలకు మలేషియా వెళ్తున్న కరాటే బెల్ట్ హోల్డర్‌కు అభినందన సత్కార కార్యక్రమాన్ని శ్రీవిజ్ఞానవేదిక, భీమవరం ఎస్‌జెజిఎమ్ హైస్కూల్ సంయుక్త ఆధ్వర్యంలో జూపూడి కళాదర్బార్ ప్రాంగణంలో బుధవారం నిర్వహించారు. క్రీడలతో మానసిక, శారీరక శాంతి లభిస్తుందని, బాల్యం నుంచి విద్యార్థులు క్రీడల పట్ల ఆసక్తిని పెంచేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎస్‌జెజిఎం హైస్కూల్ సెక్రటరీ జూపూడి నాగ దమయంతి అన్నారు. కరాటేలో శిక్షణ పొంది 13 సార్లు దేశంలో అవార్డులు, గోల్డ్ మెడల్స్ సాధించి మలేషియా అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీలకు వెళ్లటం అభినందనీయమని, అశ్విని, ప్రియ, జెర్సీలు తమ పాఠశాల విద్యార్థులు కావడం నాకెంతో ఆనందంగా ఉందని అన్నారు. హెడ్ మాస్టర్ డి.ధనం, ఉపాధ్యాయులు బి.పద్మావతి, కె.ఉమామహేశ్వరి, వి.రుక్మిణి, ఎ.సాయిరామ్, ఎం.లక్ష్మీరత్నం విద్యార్థులను అభినందించారు. ఈనెల 29 నుంచి డిసెంబర్ 3వ తేదీ వరకు మలేషియా దేశంలో అంతర్జాతీయ కరాటే పోటీల్లో వారు పాల్గొంటారని తెలిపారు. అనంతరం నాగ దమయంతి క్రీడాకారులను మెడల్స్‌తో సత్కరించారు.

1న కాపు వనసమారాధన

నరసాపురం : వచ్చేనెల 1న సీతారాంపురం లేసుపార్కు పక్కన నియోజకవర్గ స్థాయి కాపు వనసమారాధనలో కాపు, తెలగలు కుటుంబ సమేతంగా హాజరు కావాలని కాపు వన సమారాధన కమిటీ మండల ఇన్‌ఛార్జి పులపర్తి ప్రతాప్ అన్నారు. ఈమేరకు బుధవారం కాపు సంఘం నాయకులు ఆహ్వాన పత్రికలందించి మరీ ఆహ్వానించారు. మండలంలోని స్వర్ణాంధ్ర కాలేజీలోని కాపు విద్యార్థులు, ఆధ్యాపకుల్ని కలిసి ఆహ్వాన పత్రాలందించారు. ఇప్పటికే పట్టణ, మండలం, మొగల్తూరు ప్రాంతాల్లోని కాపు కుటుంబీకుల్ని కలిసి ఆహ్వానించడం జరిగిందని నాయకులు చెప్పారు. ఈ కార్యక్రమంలో కావలి నాని, పోలిశెట్టి మదు, చినమిల్లి శ్రీనువాస్, గంధం రామకృష్ణ పాల్గొన్నారు.

ఆహ్వాన పత్రాలు అందజేస్తున్న ప్రతాప్

సిద్ధమైన పట్టభద్రుల ఓటరు జాబితా

ఉండి: ఉమ్మడి తూర్పు పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సికి సంబంధించి 382,383 పోలింగ్ స్టేషన్ల ఓటర్ జాబితా సిద్ధమై, ఉండి తహశీల్దార్ కార్యాలయంలో ప్రచురించడం జరిగిందని తూర్పు, పశ్చిమగోదావరి జిల్లా పట్టభద్రుల నియోజకవర్గ సహాయక ఓటర్ల నమోదు అధికారి కావడి నాగార్జున బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టభద్రుల ఓటర్లు తమ పేర్లను ఓటర్ జాబితాలో పరిశీలించుకుని ఏదైనా అక్షర దోషాలు, తప్పులు ఉంటే వెంటనే దానికి సంబంధించిన అప్లికేషన్ పూర్తిచేసి, తహశీల్దార్ కార్యాలయంలో అందజేయాలని ఆయన తెలిపారు.

డిగ్రీ కళాశాలలో ఎయిడ్స్‌పై అవగాహన

పాలకొల్లు : పాలకొల్లు ఎఎస్‌ఎన్‌ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎపి కమిషనరేట్ ఆఫ్ కాలేజీ ఎడ్యుకేషన్ మంగళగిరి వారి ఆదేశాల మేరకు కళాశాల రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో గత 3 రోజులుగా జరుగుతున్న కార్యక్రమాలలో భాగంగా 25వ తేదీన పేపర్ పెయింటింగ్, 26న ఫేస్ పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి విద్యార్థులు ప్రదర్శించిన పెయింటింగ్లను పరిశీలించి, వారిలో ఉన్న సృజనాత్మకతను మెచ్చుకుని, ఈవిధమైన కార్యక్రమాల్ని చేపట్టడం ద్వారా సమాజంలో కలిగే మహమ్మారి ఎయిడ్స్ నుంచి ప్రజలను అప్రమత్తం చేయుటలో ఇది ఎంతో తోడ్పడుతుందన్నారు. ఎయిడ్స్ వ్యాధిని 2030 సంవత్సరంలోగా పూర్తిగా నివారించగలమా? అనే అంశంపై జరిగిన డిబెట్ కార్యక్రమంలో శ్రీగౌతమి జూనియర్ కళాశాల పూలపల్లి, శ్రీఎఎస్‌ఎన్‌ఎం జూనియర్ కళాశాల పాలకొల్లు, శ్రీఎఎస్‌ఎన్‌ఎం డిగ్రీ కళాశాల పాలకొల్లు, ఎంవిఆర్ జూనియర్ కళాశాల ఆచంట విద్యార్థులు పాల్గొన్నారు.

1న మెగా కేన్సర్ వైద్య శిబిరం

పాలకొల్లు : వచ్చేనెల 1వ తేదీ ఆదివారం పాలకొల్లు క్షత్రియ సంక్షేమ పరిషత్ కళ్యాణ మండపంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు కాస్మో స్పోర్ట్స్ కాంప్లెక్స్ అధ్యక్షులు గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు, ఉపాధ్యక్షుడు రుద్రరాజు సత్యనారాయణ రాజు తెలిపారు. బుధవారం కాస్మోలో మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ కాస్మోతో పాటు క్షత్రియ సంక్షేమ పరిషత్ వారి సౌజన్యంతో ఉచిత కేన్సర్ నిర్ధారణ పరీక్షా శిబిరం ప్రధాన అంశంగా ఉన్నట్లు చెప్పారు. శిబిరాన్ని మంత్రి నిమ్మల రామానాయుడు ప్రారంభిస్తారని, జిల్లా ఎస్‌పి సల్మాన్ నయీం అస్మీ, డిఎస్‌పి డాక్టర్ శ్రీవేద పాల్గొంటారని అన్నారు. శిబిరంకు వచ్చే వారికోసం తిల్లపూడి, లంకలకోడేరు, పోడూరు, దొడ్డిపట్ల నుంచి 5 బస్‌లు ఏర్పాటు చేసినట్లు, ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రుద్రరాజు సత్యనారాయణ రాజు, చేకూరి సూర్య నారాయణ రాజు, డాక్టర్ కెఎస్‌పిఎన్.వర్మ, కెవి సీతారామరాజు, డిటిడిసి బాబు పాల్గొన్నారు.

విద్యుత్ టవరెక్కి వ్యక్తి హల్‌చల్

బస్టాండ్ ప్రాంతంలో ట్రాఫిక్ జామ్

భీమవరం టౌన్ : స్థానిక ఒకటవ పట్టణం పరిధిలోని బస్టాండ్ ఏరియాలో విద్యుత్ టవర్ ఎక్కి వసంతరావు అనే వ్యక్తి బుధవారం సాయంత్రం హల్చల్ చేశాడు. దీంతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్ జామ్ కావడంతో ప్రయాణికులు ఇబ్బందికి గురయ్యారు. వసంతరావును విద్యుత్ టవర్ నుంచి దింపేందుకు అటు ఫైర్ స్టేషన్ అధికారులు ఫైర్ ఇంజన్‌తో సిద్ధమయ్యారు. ఇదే వ్యక్తి పలు సందర్భాల్లో విద్యుత్ టవర్లు, వాటర్ ట్యాంక్ ఎక్కి తరచూ పోలీసులకు, పట్టణ ప్రజలకు తలనొప్పిగా మారుతున్నాడని స్థానికులు చెబుతున్నారు. అయితే వసంతరావు ఎంత చెప్పినా పైనుంచి కిందకు దిగి రాను ససేమిరా అంటున్నాడు. కాగా పోలీసు మాత్రం ఆ వ్యక్తిని దింపేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

విద్యార్థులకు ఉత్తమ విద్యనందించాలి : కలెక్టర్

భీమవరం : ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపకులు విద్యార్థులకు మంచి విద్యను అందించి, ప్రయోజకులను చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ నాగరాణి ప్రభుత్వ, ఎయిడెడ్ జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్‌తో ఇంటర్మీడియట్ ఫలితాలు, తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లల భవిష్యత్తును నిర్దేశించే ఇంటర్మీడియట్ విద్యను అత్యంత నాణ్యతగా అందించాలన్నారు. జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి ఎ.నాగేశ్వరరావు, జిల్లాలోని అన్ని జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్ పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

ది.23-11-2024వ తేదీన నా యొక్క పాస్‌పోర్టు నెం.టి 2653377 గల పాస్‌పోర్టును జిరాక్స్ తీయించుకొను నిమిత్తము ఆకివీడులో మా ఇంటి వద్ద నుండి ఆకివీడు సెంటరుకు వెళ్ళుచుండగా నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్టు ఎక్కడో పడిపోయినది. దొరికిన వారు ఈ క్రింది చిరునామాకు తెలియ చేయవలసినదిగా యావన్మందిని కోరడమైనది.

**రాపాక విమల, (భర్త) నరేష్,
ఆకివీడు, ఆకివీడు మండలం,
పశ్చిమ గోదావరి జిల్లా.
ఫోన్:9573948814.**

ప్రకటన

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S.No.84/2018

Between:
పంతం ధర్మారావు ...వాది
Vs
పంతం సత్యనారాయణ స్వామి వగైరా ...ప్రతివాద్లు

పై నెంబరు దావాలో ఎనిమిదవ ప్రతివాది శ్రీమతి పంతం నాగ జ్యోతి భర్త వడయవార్లు, తండ్రి పంతం సింహాద్రి డోర్.నెం.8-24-9, రామానుజకూటమి వీధి, 18వ వార్డు, తాళ్ళముదునూరుపాడు, తాడేపల్లిగూడెం అనువారు పై నెంబరు దావాలో కోర్టు ద్వారా ఎన్నిమార్లు దావా సమన్లు పంపినప్పటికీ తీసుకొనక evade చేయుచున్నందున శ్రీకోర్టు వారి ఉత్తర్వులు మేరకు యీ ప్రకటన ఇవ్వడమైనది. కావున సదరు ఎనిమిదవ ప్రతివాది శ్రీమతి పంతం నాగజ్యోతి భర్త వడయవార్లు, తండ్రి పంతం సింహాద్రి, డోర్‌నెం.8-24-9, రామానుజ కూటమి వీధి, తాళ్ళముదునూరుపాడు, తాడేపల్లిగూడెం ది.10-12-2024వ తేదీన ఉదయం గం.10.30 నిమిషములకు పైన తెలిపిన కోర్టులో స్వయంగా గాని అడ్వకేట్ ద్వారా గాని హాజరయి ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పరోక్షమున తీర్మానించబడునని తెలియపరచడమైనది.

తాడేపల్లిగూడెం **ధూళిపాళ సూర్యరామారావు**
తేది.26-11-2024 వాది తరపు న్యాయవాది